

కేసీఆర్‌తో మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు చల్ల హరిశంకర్, రుద్ర రాజు, రవీందర్ రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, అనిల్ గౌడ్



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, అనిల్ కూర్మాచలం

కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, నాయకులు బండ శ్రీనివాస్, రెడ్డవేణి మధు

అధినేత కేసీఆర్‌తో జిల్లా నాయకులు

కరీంనగర్, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో పార్టీ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆదివారం సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పని చేయాలని పార్టీ శ్రేణులకు కేసీఆర్ సూచించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా నాయకులు కేసీఆర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

పార్టీ అధినేతతో సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ

గన్నేరువరం ఎస్‌ఐగా నరేశ్

ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న నరేశ్

గన్నేరువరం, మార్చి 3: గన్నేరువరం మండల పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా తాండ్ర నరేశ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ చందా నరసింహారావు కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎస్‌ఐ నరేశ్ బదిలీపై వచ్చారు.

12 నుంచి ఎల్‌ఎల్‌బీ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మార్చి 3 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎల్‌ఎల్‌బీ 3వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 12 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కొనసాగే పరీక్షలకు యూనివర్సిటీలో పరీక్ష కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు.

బీ, ఎం ఫార్మసీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఎస్‌యూ పరిధిలో బీ ఫార్మసీ 1వ, 7వ, ఎం ఫార్మసీ 1, 3వ సెమిస్టర్ పరీక్ష ఫీజు మార్చి 12వ తేదీలోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ. 300తో మార్చి 15వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు.

మానేరు వాకర్స్ శ్రమదానం

హౌసింగ్‌బోర్డుకాలనీ, మార్చి 3: మానేరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేశారు. మానేరు డ్యామ్ కట్టపక్కన వాకింగ్ ట్రాక్‌పై వాకింగ్ చేసే వారికి ఇబ్బందికరంగా ఉన్న ముళ్ల చెట్లు, పొదలను తొలగించారు. కార్యక్రమంలో మానేరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వాకింగ్ ట్రాక్ పక్కన ఉన్న జిమ్ సెంటర్ పరిధిలో నానో కార్పస్ చెట్లు విపరీతంగా పెరుగడం వల్ల జబ్బుల బారిన పడుతున్నామని, వాటిని తొలగించాలని మానేరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్థానిక కార్పొరేటర్ జయశ్రీని కోరారు. కాగా, ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి తొలగించే ప్రయత్నం చేస్తామని ఆమె తెలిపారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, మార్చి 3: మహాశివరాత్రి, హోలీ పండుగ సందర్భంగా కరీంనగర్‌లోని మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో ఖాదీ వస్త్రాల కొనుగోలుపై 40శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ భిక్షపతి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల ఖాదీ భవన్‌లో ఈ నెల 30 వరకు తగ్గింపు ధరలపై అమ్మకాలు సాగుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు ధరించి, నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు.

పల్స్ పోలియో విజయవంతం

కార్పొరేషన్/ కొత్తపల్లి/ కరీంనగర్ రూరల్/ హుజూరాబాద్‌టౌన్/రూరల్/ జమ్మికుంట/ సైదాపూర్/ వీణవంక/ మానకొండూర్/ రూరల్/ తిమ్మాపూర్/ శంకరపట్నం/ చిగురుమామిడి/ గన్నేరువరం/ చొప్పదండి / గంగాధర, మార్చి 3: జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం మొదటి రోజు విజయవంతమైంది. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు హాజరై ఐదేండ్లలోపు పిల్లలకు చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారులు పర్యవేక్షించారు. నగరంలోని 33వ డివిజన్‌లో భగవతి స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో పోలియో మహమ్మారిని తరిమి కొట్టే సంకల్పంతో ప్రభుత్వం ఏటా ఈ కార్యక్రమం చేపడుతున్నదన్నారు. తల్లిదండ్రులు ఐదేండ్లలోపు పిల్లలకు పోలియో డ్రాప్స్ వేయించాలని, తద్వారా జీవితకాలం మంచి ఆరోగ్యాన్ని ఇచ్చిన వారు అవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భగవతి స్కూల్ ప్రిన్సిపాల్ రమణారావు, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు. కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్ హెల్త్‌సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ పిల్లి శ్రీలతామహేశ్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దావా కమలామనోహర్, స్పెషల్ ఆఫీసర్ రంజిత్ కుమార్, డాక్టర్ మౌనిక, డాక్టర్ వనజ, కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్‌ఎం శ్వేత తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ మండలం చామనపల్లిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య ప్రారంభించారు. మండలంలో మొత్తం 2650మంది చిన్నారులు ఉండగా, ఆదివారం 2,374 మందికి పోలియో చుక్కలు వేశామని పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ తెలిపారు. హుజూరాబాద్ డివిజన్ పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని హుజూరాబాద్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు తెలిపారు. చెల్పూరు, చల్లూరు, వీణవంక, ఇల్లందకుంట, వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలు, హుజూరాబాద్, జమ్మికుంట పట్టణ పరిధిలోని వార్డుల్లో మొత్తం 22,653 మంది ఐదేండ్లలోపు పిల్లలకు గానూ ఆదివారం 21,657 మందికి (95శాతం) పోలియో చుక్కలను వేయించినట్లు వెల్లడించారు. పట్టణంలోని సిద్ధార్థనగర్ కాలనీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డా.చందు ప్రారంభించారు. బాలికల పాఠశాలలో చిన్నారులకు పురపాలక చైర్‌పర్సన్ గందె రాధిక పోలియో చుక్కలు వేశారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, మండల పరిధిలో పెద్దంపల్లి గ్రామంలో ఎంపీపీ దొడ్డె మమత పల్స్ పోలియోను ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైద్యులు ఫర్హాన్ ఉద్దీన్, హిమబిందు, సంధ్యారాణి, మహోన్నత, సంధ్య, చందన, కార్తీక్, సీహెచ్‌వో సాజిద్, హెచ్‌ఈ ప్రతాప్, సూపర్‌వైజర్లు రత్నకుమారి, స్వరూప, అరుణ, సదానందం, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు. సైదాపూర్ మండలంలోని రాయికల్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. మానకొండూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఓ చిన్నారికి పోలియో డ్రాప్స్ వేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిల్ప, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అలేఖ్య, డాక్టర్ మైథిలి, సీహెచ్‌వో రాజానాయక్, సిబ్బంది పాల్గొన్నారు. శంకరపట్నం మండలంలో ఐదేండ్లలోపు పిల్లలు 2,832 మంది ఉండగా, 28 బూత్‌లతో పాటు మరో ప్రత్యేక బూత్ ద్వారా 2,766 మందికి వైద్య ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. కేశవపట్నంలో డీటీసీవో రవీందర్‌రెడ్డి పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులికోట రమేశ్, ఎంపీటీసీల ఫోరం మండల చైర్మన్ పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యాంప్రసాద్, వైద్యా ఆరోగ్య సిబ్బంది, ఎంపీటీసీలు, నాయకులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. చిగురుమామిడిలో జడ్పీటీసీ గీకురు రవీందర్, మండల వైద్యాధికారి విప్లవ శ్రీ ఐదేండ్ల లోపు చిన్నారులకు చుక్కల మందు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పల్లె దవాఖాన వైద్యాధికారులు మాధురి, లక్ష్మీప్రసన్న, నిహారిక, సంతోష్, సందీప్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, ఫార్మసిస్ట్ రామేశం, సూపర్‌వైజర్లు హాజీ బాబా, హేమలత, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. గన్నేరువరం మండల వ్యాప్తంగా ఐదేండ్లలోపు పిల్లలకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేశారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ గ్రామంలోని సుభాష్ నగర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ కేతిరెడ్డి వనిత ప్రారంభించారు. తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో కిరణ్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ ప్రణవ్, ఏఎన్‌ఎం రాణి, అంగన్‌వాడీ టీచర్ ఫరీదా, ఆశ కార్యకర్తలు స్వరూప, సంగీత తదితరులు పాల్గొన్నారు. అలాగే మహాత్మానగర్‌లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి పర్యవేక్షించారు. ఇక్కడ అంగన్వాడీ టీచర్లు కవిత, పద్మ, అంబిక, ఆశ కార్యకర్త సుజాత తదితరులు పాల్గొన్నారు. చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ చిలుక రవీందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణు గోపాల్ రావు, ఎంసీహెచ్‌పీవో సానాజువేరి, ఎంపీవో రాజ్ గోపాల్ రెడ్డి, గ్రామ కార్యదర్శి మెహతాబ్, మండల వైద్యాధికారి శైలేందర్, వైద్య సహనాయకుడు రవి నాయక్, పల్లె దవాఖాన డాక్టర్ షేక్ మస్రత్, ఏఎన్‌ఎం రమ్య, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. గంగాధర మండలంలోని 33 గ్రామాల్లో 35 బూత్‌లు, 18 హైరిస్క్ ఏరియాల్లో 0–5 లోపు చిన్నారులు 4270 మందికి (దాదాపు 88 శాతం) పోలియో చుక్కలు వేశారు.

నగరంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ సునీల్‌రావు

మానకొండూర్: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఎంపీ సంజయ్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

గన్నేరువరం, మార్చి 3: గన్నేరువరం నుంచి కరీంనగర్ వరకు మానేర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ బండి సంజయ్ కుమార్ గత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బ్రిడ్జి సాధన జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో బ్రిడ్జి సాధన జేఏసీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించని పక్షంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బ్రిడ్జి సాధన జేఏసీ చైర్మన్ సంపత్ ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడు పుల్లెల జగన్, ప్రధాన కార్యదర్శి పుల్లెల రాము, నాయకులు పాల్గొన్నారు.

ఓటరు అవగాహన సదస్సు

వీణవంక, మార్చి 3: చల్లూరు గ్రామంలో ఆదివారం నెహ్రూ యువకేంద్రం, ఆదర్శ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ వెంకటరాంబాబు, ప్రతి పౌరుడూ బాధ్యతగా, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ యూత్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సరిచేయాలి

కలెక్టరేట్, మార్చి 3 : నగరంలో గందరగోళంగా ఉన్న ఓటర్ల జాబితాను అధికారులు వెంటనే సరిచేయాలని తెలంగాణ ప్రజా చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇర్ఫాన్ డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లోపు ఎవరి డివిజన్‌లో వారు ఓటు వేసేలా జాబితాను సవరించి, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని ఒక ప్రకటనలో కోరారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1975–76 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

వీణవంక, మార్చి 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం (1975–76 పదో తరగతి బ్యాచ్) ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కోఆర్డినేటర్ సూరోజు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ శంకుస్థాపన

22వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సంజయ్

హుజూరాబాద్‌టౌన్/ సైదాపూర్, మార్చి 3: హుజూరాబాద్ పట్టణంలో ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆదివారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. 22వ వార్డులోని కాకతీయకాలనీలో, 15వ వార్డులోని బృందావన కాలనీలో, బోర్నపల్లి గ్రామంలోని 14వ వార్డులో ఒక్కో చోట రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనుండగా, పనులను ప్రారంభించారు. తర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో పాటు మ్యానిఫెస్టోలోని హామీలన్నీ అమలు కావాలంటే రూ.5 లక్షల కోట్ల నిధులు అవసరం ఉంటుందన్నారు. అప్పుల్లో ఉన్న తెలంగాణకు ఎక్కడి నుంచి నిధులు తీసుకొస్తారని ప్రశ్నించారు. తనను మళ్లీ ఎంపీగా గెలిపిస్తే ప్రధానిని ఒప్పించి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధిలో కరీంనగర్‌ను ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. అంతకుముందు సైదాపూర్ మండలంలోని అమ్మనగుర్తి, బొమ్మకల్, ఘనపూర్, సైదాపూర్, వెన్కేపల్లి, వెన్నంపల్లి తదితర గ్రామాల్లో రెండో విడుత ప్రజాహిత యాత్ర చేపట్టిన ఆయన, తర్వాత హుజూరాబాద్ పట్టణానికి చేరుకున్నారు. ఇప్పలనర్సింగపూర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా బోర్నపల్లి గ్రామంలోని 24 వార్డులో పోలియో చుక్కల కేంద్రాన్ని సంజయ్ సందర్శించి చిన్నారికి పోలియో డ్రాప్స్ వేశారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

సైదాపూర్, మార్చి 3: బొమ్మకల్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా కేడిక శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చిట్టి సర్వేశ్వర్‌రెడ్డి, కార్యదర్శిగా లక్కిరెడ్డి విజేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఏలూరి మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా పూరెల్ల శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.

భక్తహనుమాన్ ఆలయంలో గరుడ హోమం

కొత్తపల్లి, మార్చి 3 : కమాన్‌పూర్ భక్తహనుమాన్ ఆలయంలో ఆదివారం గరుడ హోమం వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకుడు జగన్నాథ విష్ణుశర్మ ఆధ్వర్యంలో పూజారులు గరుడ హోమం నిర్వహించి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. భక్తులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సోషల్ మీడియా సంగమం

కమాన్‌చౌరస్తా, మార్చి 3 : సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో సోషల్ మీడియా సంగమం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ కరీనగర్ విభాగ్ సంఘ్ చాలక్ డాక్టర్ భీమనాతిని శంకర్ మాట్లాడుతూ, నేటి యువత సోషల్ మీడియాలో మరింత క్రియాశీలంగా ఉండాలన్నారు. ముఖ్యఅతిథి సీనియర్ జర్నలిస్ట్ సురేశ్ కొచ్చాటిల్, సామాజిక కార్యకర్త కట్టా రాజగోపాల్ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాప్తి అవుతున్న అనేక అబద్ధపు ప్రచారాల్ని తిప్పికొట్టాలన్నారు. దేశ విచ్ఛిన్నతకు జరుగుతున్న అనేక కుట్రలను ఎదుర్కోవాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు నిరంజనాచారి, ఎలగందుల సత్యనారాయణ, సమాచార భారతి కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్థవంతంగా చెప్పగలిగేదే ఉత్తమ కవిత్వం

న్యాయమూర్తి సరళరేఖను సన్మానిస్తున్న కవులు

కమాన్ చౌరస్తా, మార్చి 3 : పండితులకే కాకుండా పామరులకు సైతం అర్థమయ్యేలా చెప్పగలిగేదే ఉత్తమ కవిత్వమని కరీంనగర్ న్యాయమూర్తి సరళ రేఖ అన్నారు. ఆదివారం స్థానిక వాగేశ్వరి కళాశాలలో ఉదయసాహితీ, జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి మహిళా కవిసమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎర్రం రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఉదయసాహితీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీదాస్యం లక్ష్మయ్య గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఉదయ సాహితీ కరీంనగర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మేజర్ రేళ్ల సంజీవ్ సారథ్యంలో ఆరు ఆవృతాల్లో మొత్తం 63 మంది కవయిత్రులు పాల్గొని కవితాగానం చేశారు. కవయిత్రులు వెగ్గలం ఉషశ్రీ, నూగూరి నాగవేణి, ఆది విజయలక్ష్మి, చిందం సునీత, కట్టా ఝాన్సీ, కొమురోజు మాధవి కవిసమ్మేళనం నిర్వహించారు.

'వైరాగ్యం'కు గుర్రం జాషువా పురస్కారం

కమాన్‌చౌరస్తా, మార్చి 3: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన జాతీయ కవి సమ్మేళనంలో కరీంనగర్‌కు చెందిన భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ కవితా పఠనం చేసి మహాకవి జాషువా పురస్కారాన్ని అందుకున్నారు. డాక్టర్ బిక్కి కృష్ణ, సాహితీ సామ్రాట్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పెద్దిటి యోహాను పురస్కారాన్ని ప్రదానం చేసి అభినందించారు.

రాజీవ్ గృహకల్ప భూములను ఇప్పించండి

రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులు

కొత్తపల్లి, మార్చి 3 : చింతకుంట గ్రామంలో గల రాజీవ్ గృహకల్ప భూములను కొందరు కబ్జా చేశారని, ప్రభుత్వం సర్వే చేసి వాటిని తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు చేపట్టిన మూడు రోజుల రిలే దీక్షలు ఆదివారం ముగిశాయి. 2013–2014 సంవత్సరంలో రాజీవ్ గృహకల్ప భూములను కబ్జా చేసుకున్నారని, వారిపై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించాలన్నారు. రిలే నిరాహారదీక్షల్లో కే శంకరయ్య, కే స్వప్న, శ్రీనివాస్, కనకయ్య, రాంరెడ్డి, భిక్షపతి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కు తప్పిన తిప్పలు

గంగాధర, మార్చి 3 : బూరుగుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బొమ్మకంటిపల్లి గ్రామస్తులు రేషన్ బియ్యం తీసుకోవడానికి రెండు కిలోమీటర్ల దూరంలోని బూరుగుపల్లికి వెళ్లవలసి వచ్చేది. దీంతో మహిళలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. స్థానిక నాయకుడు బైరిశెట్టి సంపత్ విషయాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి, ప్రతినెలా బొమ్మకంటిపల్లిలో కూడా రేషన్ బియ్యం ఇచ్చేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో రేషన్ డీలర్ ఆదివారం బొమ్మకంటిపల్లిలో రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. తాము కోరగానే సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు నాయకుడు సంపత్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

10న మంత్రికి సన్మానం

సైదాపూర్, మార్చి 3: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈ నెల 10న కరీంనగర్‌లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో గౌడ సంఘం నాయకులతో కలిసి సన్మాన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, మార్చి 3: నగరంలోని ఇందిరా భవనంలో ఈ నెల 7న నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ కోరారు. నగరంలోని ప్రెస్ భవనంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఎంసీహెచ్ విజిటర్స్ షెడ్డును ఆధునీకరించండి: కలెక్టర్

విద్యానగర్, మార్చి 3: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం విజిటర్స్ షెడ్డును ఆధునీకరించాలని వైద్యాధికారులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఆదివారం షెడ్డును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దవాఖానకు వచ్చే రోగుల కుటుంబ సభ్యుల సౌకర్యం కోసం ఇందులో షెల్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. బెడ్స్, కుర్చీలు, లాకర్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. రాత్రిపూట రోగుల కుటుంబ సభ్యులు ఉండేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వారం రోజుల్లో ఈ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల వార్డుల్లోకి ఎప్పుడు పడితే అప్పుడు రోగుల కుటుంబ సభ్యులను పంపించవద్దని వైద్యాధికారులకు సూచించారు. దవాఖానను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దని ఆదేశించారు.

శాంతి భద్రతలకు సహకరించాలి: ఏసీపీ

జమ్మికుంట/హుజూరాబాద్‌టౌన్, మార్చి3: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలను నిర్వహించుకుందామని, శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ పిలుపునిచ్చారు. ఆదివారం జమ్మికుంట, హుజూరాబాద్ పట్టణాల్లో టౌన్ సీఐలు రవి, రమేశ్ ఆధ్వర్యంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పోలీసు కవాతు(ఫ్లాగ్‌మార్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ కొద్ది రోజుల్లో రానుందని, ఎలక్షన్లలో ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ కేంద్ర బలగాలు, పోలీసులు, తదితరులున్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కార్పొరేషన్, మార్చి 3: రాష్ట్రంలో మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక 37వ డివిజన్ మీ కోసం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను పార్లమెంట్ ఎన్నికల్లోగానే అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు రవీందర్, సంజీవ్, రవి, మహేందర్, వాణి, జిల్లా అధ్యక్షుడు బొమ్మరాతి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్, నాయకులు సత్తినేని శ్రీనివాస్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన విద్యార్థిని ప్రతిభ

కమాన్‌చౌరస్తా, మార్చి 3 : శాతవాహన విశ్వవిద్యాలయం ఇటీవల ప్రకటించిన పీజీ ఫలితాల్లో కొత్తపల్లికి చెందిన ఎంఎస్సీ బొటనీ విద్యార్థిని బదర్ జహర విశ్వవిద్యాలయ మొదటి ర్యాంక్ సాధించి బంగారు పతకం పొందింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ జయంతి విద్యార్థినిని బదర్ జహరను అభినందించారు. యూనివర్సిటీ వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ నర్సింహమూర్తి, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న క్లబ్ బాధ్యులు

విద్యానగర్, మార్చి 3: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ భగత్‌నగర్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా వ్యవహరించిన వాసుదేవ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, అలయన్స్ క్లబ్, భగత్‌నగర్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. ఆ బాధ్యతను మరింతగా ముందుకు తీసుకెళ్లడానికి నూతన అధ్యక్షుడిగా కట్కూరి సుధాకర్, జనరల్ సెక్రెటరీగా గీకురు ఆంజనేయులు, ట్రెజరర్‌గా భోగ నగేశ్, పీఆర్‌వోగా గుడాల కృష్ణ ఎన్నికైనట్లు ప్రకటించారు. వీరికి అలయన్స్ క్లబ్ జిల్లా కార్యవర్గం అభినందనలు తెలిపింది. కార్యక్రమంలో ఇంజినీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ ఏ శ్రీనివాస్, చీకోటి శ్రీనివాస్ గాంధీ, పుల్లెల శ్యామ్, మొగులోజు సత్యాచారి, పండుగ నాగరాజు, టీ వెంకటేశ్వరరావు, ఎస్ సత్తయ్య, ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణ

కమాన్‌చౌరస్తా, మార్చి 3 : జిల్లా కేంద్రంలోని కశ్మీర్‌గడ్డ షెడ్యూల్డ్ కులాల కళాశాల వసతి గృహం విద్యార్థినులకు ఇంపాక్ట్ డైరెక్టర్ కుతాడి తిరుపతి ఆధ్వర్యంలో హాస్టల్ వార్డెన్ విజయలక్ష్మి వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 120 మందికి పైగా విద్యార్థినులు, 20 మందికి పైగా తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ డైరెక్టర్ కుతాడి తిరుపతి, ఇంపాక్ట్ స్పీకర్ సాయిబాబు, ఇంపాక్ట్ ట్రైనర్ జాహ్నవి మాట్లాడుతూ, యువతులకు తల్లిదండ్రులే మొదటి హీరోలని చెప్పారు. ఒకరు వేలెత్తి చూపకుండా లక్ష్య సాధనకు ప్రయత్నం చేయాలన్నారు.

ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నా పత్రాలు

ఇల్లందకుంట, మార్చి 3: ఈ నెల 10 నుంచి జరిగే పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రాలు ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. మండలంలో ఇల్లందకుంట, టేకుర్తి రెండు పరీక్షా కేంద్రాల్లో 150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఆదివారం మొదటి విడుతలో వచ్చిన ప్రశ్నాపత్రాలను బాక్స్‌ల్లో పెట్టి సీల్‌వేసినట్లు డీఆర్‌వోలు తిరుపతి, వేణు, సీఏఎస్‌లు సమ్మయ్య, రాములునాయక్ తెలిపారు.

శ్రీనివాస్ నగర్‌లో ఉచిత వైద్యశిబిరం

మానకొండూర్, మార్చి 3: శ్రీనివాస్ నగర్ గ్రామంలో ఆదివారం కరీంనగర్ శివకృష్ణ మల్టీస్పెషాల్టి హాస్పిటల్ వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన గ్రామస్తులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ చైతన్య, నిహారిక, సిబ్బంది సందీప్, శ్రీధర్, ఎంపీటీసీ ఎరవేణి రామాంజనేయులు, మాజీ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ అనవేని రాజు, యాదవ సంఘం అధ్యక్షుడు కొమ్ము మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ యువజన సంఘం నూతన కమిటీ

చొప్పదండి, మార్చి 3: చొప్పదండి గౌడ యువజన సంఘం అధ్యక్షుడిగా బొమ్మగాని రంజిత్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పూదరి మధు, ప్రధాన కార్యదర్శులుగా బొడిగె సాయికృష్ణ, బొడిగె శ్రావణ్, ఉపాధ్యక్షులుగా గుర్రం సాయికృష్ణ, బొడిగె శ్రీనివాస్, కోశాధికారిగా బొడిగె గంగరాజు, బుర్ర హరీశ్, కార్యదర్శులుగా బొడిగె మణిచంద్ర, పొన్నం శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మేడి రాకేశ్, ప్రచార కార్యదర్శులుగా బొడిగె ప్రవీణ్, బొడిగె చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా జాగిరి సాయి గణేశ్, బొడిగె శ్రీకాంత్, బొడిగె సాయి చందు, బొడిగె సాయికుమార్, బొడిగె రమేశ్ ఎన్నికయ్యారు. అనంతరం గౌడ సంఘం అధ్యక్షులు పెరమండ్ల గంగయ్య, యువజన సంఘం మాజీ గౌరవాధ్యక్షుడు బత్తిని ప్రశాంత్ నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

బిర్లా స్కూల్‌లో చదరంగం పోటీలు



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

కరీంనగర్ రూరల్, మార్చి 3: బొమ్మకల్‌లోని బిర్లా ఇంటర్నేషనల్ ఓపెన్ మైండ్ స్కూల్‌లో ఆదివారం విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అంతర్గత చదరంగం పోటీలను నిర్వహించింది. మూడు విభాగాల్లో సాగిన పోటీల్లో సుమారు 100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కంకటి కనకయ్య, పాఠశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.